

డ్రైనేజీల్లో దోమలు పెరగకుండా మందును పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది



చెత్తను ఎత్తుతున్న పంచాయతీ సిబ్బంది

# స్వచ్ఛతలో మేటి హంపోలి (కే)

- గ్రామంలో నిరంతరం పారిశుధ్య పనులు
- చెత్తతో వర్మీ కంపోస్టు తయారీ
- ఆయిల్ బాల్స్, మందు పిచికారీతో దోమల నివారణ



ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

భైంసాటౌన్, అక్టోబర్, 13 : పల్లెలను పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా తీసుకుంటున్న చర్యలతో గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. మండలంలోని హంపోలి (కే) గ్రామంలో నిత్యం పారిశుధ్య పనులు చేపడుతుండడంతో శుభ్రంగా కనిపిస్తున్నాయి.

### పరిశుభ్రతకు పెద్దపీట

గ్రామంలో 650 నివాసాలు ఉండగా, 70 శాతానికి పైగా అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు పూర్తయ్యాయి. పంచాయతీ కార్మికులు ప్రతిరోజూ వీధులను శుభ్రం చేస్తూ డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. అలాగు మురుగునీరు బయటకు రాకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకుంటున్నారు. పంచాయతీ ట్రాక్టర్ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంప్ యార్డుకు తరలిస్తున్నారు. మరోవైపు ప్లాస్టిక్ వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం డ్రై డే గా పాటించి ఇండ్ల వద్ద నిల్వ నీటిని తొలగిస్తున్నారు.

### ఆయిల్ బాల్, మందు పిచికారీ

గ్రామంలో ఎక్కడైనా మురుగు నీరు నిల్వ ఉంటే వాటిని దోమలు, ఈగలు ఆవాసాలుగా మార్చుకుంటుండడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంటుంది. దీని నిర్మూలనకు పంచాయతీ సిబ్బంది ఆయిల్ బాల్స్, మందులను పిచికారీ చేస్తున్నది. ఆయిల్ బాల్స్‌ను మురుగు నీటిలో వదిలి దోమల వ్యాప్తిని నిర్మూలిస్తున్నారు.

### వర్మీ కంపోస్టు తయారీ

గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా డంప్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి నిల్వ చేసి కంపోస్టు ఎరువును తయారుచేస్తున్నారు. ఈ ఎరువును హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు ఉపయోగిస్తున్నారు.



గ్రామంలో వేసిన సీసీ రోడ్డు

అలాగే గ్రామంలో సేకరించిన ఖాళీ సీసాలను పంచాయతీ ఆధ్వర్యంలో విక్రయించి ఆదాయం గడిస్తున్నారు.

### ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం



హంపోలి (కే) గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం పారిశుధ్య పను లు చేయిస్తున్నాం. తడి, పొడి చెత్తగా సేకరించి వేరు చేస్తున్నాం. చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి మొక్కలకు ఎరువుగా వాడుతున్నాం. ప్రజల సహకారం కూడా బాగున్నది.

**-ప్రసాద్ పటేల్, సర్పంచ్, హంపోలి (కే)**

## బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

ముథోల్, అక్టోబర్, 13 : మండలంలోని ఆష్టా, బ్రహ్మణ్‌గాం గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని వారిలో ధైర్యాన్ని నింపారు. ఈయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచ్‌లు సుకన్య రమేశ్, రాంరెడ్డితో పాటు నాయకులు కిష్టయ్య, పోశెట్టి, సాయరెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

## హ్యాట్రిక్ విజయమే ధ్యేయంగా పనిచేయాలి

- యువనాయకుడు గౌతమ్‌రెడ్డి



బీఆర్ఎస్ యువ నాయకుడు గౌతమ్‌రెడ్డిని కలిసిన మండల నాయకులు

దిలావర్‌పూర్, అక్టోబర్ 13 : ప్రతి కార్యకర్త, నాయకులు సమన్వయంతో పని చేసి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హ్యాట్రిక్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రి కుమారుడు, యువ నాయకుడు గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కొమ్ముల చిన్న దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యూ లోలం, కాల్వ, గ్రామాలకు చెందిన కార్యకర్తలు నాయకులు శుక్రవారం ఆయనను కలిశారు. అనంతరం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరిస్తూ మూడోసారి ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ పీవీ రమణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కాల్వ ఆలయ చైర్మన్ పూజారం మహేశ్, కాల్వ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్లు ఇప్ప నర్సారెడ్డి, మాజీ చైర్మన్ చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు అడెపు శ్రీనివాస్, సాయన్న శ్రీనివాస్, సుధాకర్, ప్రవీణ్, గంగాధర్, మహేశ్, సాయేందర్, ఓడ్నం కృష్ణ, కాల్వ ఆలయ డైరెక్టర్ గూండ్ల నర్సయ్య, రషీద్, మహేశ్, స్వామిగౌడ్, బొడ్డు గంగయ్య, బండారి ముత్యం తదితరులు ఉన్నారు.

## చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

లోకేశ్వరం, అక్టోబర్, 13: మండలంలోని అబ్దుల్లాపూర్‌కు చెందిన సుంకరి భీమన్న (40) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమన్న ఇల్లు మూడు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. అప్పటినుంచి మానసికంగా కృంగిపోయాడు. ఈ నెల 11 న రాత్రి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. శుక్రవారం ఉదయం భీమన్న మృతదేహం అబ్దుల్లాపూర్ గ్రామంలోని బీబీ చెరువులో లభ్యమైంది. భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఓటర్ ఐడీ కార్డుల పంపిణీ

కుంటాల, అక్టోబర్ 13: మండలవ్యాప్తంగా ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీని రెవెన్యూ అధికారులు వేగవంతం చేశారు. వివిధ గ్రామాల్లో 4525 మంది ఓటర్లకు ఎపిక్ కార్డులు పంపిణీ చేశామని వారు తెలిపారు. ఓటరు తుది జాబితా తయారైందని ఇంకా కొత్త ఓటరు చేర్పులకు మాత్రం సమయం ఉందని అధికారులు చెబుతున్నారు.

## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

భైంసా, అక్టోబర్, 13 : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో దళిత సంఘాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ధమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎల్. శీను, దళిత సంఘాల నాయకులు, కౌన్సిలర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

## ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్‌డే హంగామా



గిరిజన సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కుభీర్, అక్టోబర్ 13 : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటాపాటలతో హోరెత్తించారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవితవ్యం కీలక మలుపునకు ఇంటర్‌లోనే బీజం పడుతుందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన వి ద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు, అందించి క్రమశిక్షణ గల అధ్యాపకులతో బోధన అందిస్తున్నామన్నారు. ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి జీవితంలో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు గత పదేళ్లుగా ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిన లెక్చరర్లు నరేందర్, రాజేందర్‌ను కళాశాలకు విలువైన భూమిని దానమిచ్చిన (భూదాత) దొంతుల లింగన్న, వెంకట్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.